క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీకమాసం రెండవ శనివారం శనిత్రయోదశి సందర్భంగా వేకువజాము నుంచి స్వామి, అమ్మవారికి తైలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న వెంకటకృష్ణారెడ్డి

రాజుపాళెం : వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాములను ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్.వెంకటకృష్ణ, కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. వారు ఆలయం వద్దకు రాగానే ఈఓ బీవీ నరసయ్య, అర్చకులు మాధవాచార్యులు, శేషాచార్యులు, పవన్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. అర్చకులు వారికి ఆలయ చరిత్రను వివరించి శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

బ్రహ్మంగారిమఠంలో దీపోత్సవం

బ్రహ్మంగారిమఠం : కార్తీక మాసంలో భాగంగా శనివారం రాత్రి పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో పూర్వపు మఠాధిపతి పెద్దకుమారుడు వెంకటాద్రిస్వామి ఆధ్వర్యంలో ధ్వజస్తంభం దగ్గర ప్రత్యేక దీపాలు ఏర్పాటు చేశారు. ఈ దీపోత్సవంలో మహిళలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

రేపు కోటి దీపోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు కోటి దీపోత్సవం ఉంటుందని దేవాదాయశాఖ ఏసీ శంకర బాలజీ ఒక ప్రకటనలో తెలిపారు. పరమశివుని పల్లకి ఊరేగింపు, వైదిక మంత్ర పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు, లింగాభిషేకం, బిల్వార్చన, ప్రవచనాలు, సప్తహారతులు, జ్వాలాతోరణం, కోటిదీపోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రొద్దుటూరు : స్థానిక ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో శనినివారం అనాథలకు, వృద్ధులకు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు షాకీర్ హుసేన్ మాట్లాడుతూ జిమ్ ఇకో సర్వీసెస్ యాజమాని జి.లక్ష్మీ పావని కుమార్తె జి.ఆరోహి పుట్టిన రోజు సందర్భంగా 50 మందికి దుప్పట్లును పంపిణీ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాషా, అల్తాఫ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సౌకర్యాలు

రాజుపాళెం : మండలంలోని 20 అంగన్‌వాడీ కేంద్రాలకు నాడు–నేడు కింద వివిధ రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసుకునేందుకు నిధులు మంజూరైనట్లు ఐసీడీఎస్ ప్రొద్దుటూరు రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ అరుణకుమారి తెలిపారు. రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ తాగునీరు, ఫ్లోరింగ్, మరుగుదొడ్లు, పెయింటింగ్, ఫ్యాన్లు, ఎలక్ట్రికల్ వైరింగ్ తదితర వసతులు ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేలంగి కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, విజయేశ్వరి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఎవరెస్టు లాడ్జీ యజమాని మూల ఈశ్వరరెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు శనివారం పలు చోట్ల అన్నదానం నిర్వహించారు. చాపాడు మండలంలోని పల్లవోలు గ్రామంలో ఉన్న శ్రీకాశినాయన వృద్ధాశ్రమం, ఖాజీపేట మండలంలోని భూమాయపల్లె గ్రామంలోని అమ్మ శరణాలయంలోని వృద్ధులకు భోజన సదుపాయం కల్పించారు. అంతేగాక సన్నపల్లె గ్రామానికి చెందిన ఇంటర్ చదువుతున్న ఇరువురు మెరిట్ విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందచేశారు.

నేడు సాహితీ సదస్సు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 10.00 గంటలకు సాహితీ సదస్సు నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి తెలిపారు. నెలనెల సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా కొడవలూరు రామచంద్రరాజు మహాసేనోదయం అనే అంశంపై ప్రొద్దుటూరుకు చెందిన విశ్రాంత తెలుగు పండితులు ఏసీ దస్తగిరి ప్రసంగించనున్నట్లు ఆయన వివరించారు.

చదువుకుంటే గిరిజనుల తలరాత మారుతుంది

ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



గొర్రెలు, మేకలను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందుతున్నారు.. కానీ యానుదులు ఇంకా వెనుక బడి ఉన్నారు. అందుకు కారణం చదువుకోలేక పోవడం.. చదువు కుంటే వారి తలరాత మారుతుందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి యానాదులకు సూచించారు. మండలంలోని నాగపట్నం గ్రామంలో శనివారం నిర్వహించిన యానుదులకు 16 యూనిట్ల గొర్రెలు, మేకల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యానుదలకు ఒకొక్కరికి రూ.75 వేల విలువగల గొర్రెలు, మేకలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పేదుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. గిరిజనులకు ఇళ్ళ స్థలాలతోపాటు భూములను ఇచ్చిందన్నారు. యానుదులకు ప్రభుత్వం నుంచి 90 శాతం సబ్సిడీతో గొర్రెలు, మేకలను ఇవ్వాలని మిగిలిన 10 శాతం సబ్సిడీని నేను భరించి పూర్తిగా వారికి ఉచితంగా ఇచ్చేందు కృషి చేస్తానన్నారు. అనంతరం రాష్ట్ర గిరిజన శాఖ డైరెక్టర్ వెంకటమురళీ మాట్లాడుతూ మా స్వగ్రామంలోని యానాదుల పిల్లలు చదువు కునేందుకు ముందుకు వస్తే దత్తత తీసుకుని ఉన్నతస్థాయికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మైదుకూరు నియోజకవర్గంలో నిరుపేద గిరిజనులను ఆదుకోవాలని మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే డైరెక్టర్ మురళీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్‌సిద్ధిక్, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, సర్పంచ్ గడ్డం రేణుక, ఎంపీటీసీ రాముడు, కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



తెలుగుగంగకాలనీలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం కనిపిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డులో గల తెలుగుగంగ కాలనీ రోడ్డు, గాంధీనగర్‌లలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. గడిచిన నాలుగున్నర ఏళ్ళ కాలంలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్య, వైద్యం, మహిళల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు దేశంలో ఎక్కడా అమలులో లేని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. ఈ నాలుగున్నర ఏళ్ళ కాలంలో ఇప్పటికే ప్రతి కుటుంబానికి రూ.1.50 లక్షల నుండి రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరిందని, రాబోవు రోజుల్లో మరింత లబ్ధి చేకూరనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, రూరల్ సీనియర్ నాయకులు పోలిరెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు ఓబుల్‌రెడ్డి, పుత్తాశ్రీరాములు, తిరుపతిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, మౌలాలి, ఆంజనేయరాజు, నరసింహరాజు, వెంకటసుబ్బారెడ్డి, నాగఓబుల్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ ముంతాజ్, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, అర్బన్ సీఐ యుగంధర్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కట్నం ఇవ్వడమూ చట్టరీత్యా నేరమే



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఖాజా మొయినుద్దీన్

మైదుకూరు : కట్నం తీసుకోవడమే కాదు, ఇవ్వడమూ చట్టరీత్యా నేరమేనని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి షేక్ ఖాజా మొయినుద్దీన్ అన్నారు. ఈనెల 26న వరకట్న నిషేధ దినాన్న పురస్కరించుకుని శనివారం మైదుకూరులోని స్త్రీ శక్తి భవనంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది జేకే చారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ వివాహ సమయంలో కట్న కానుకలు ఇవ్వడం అనవాయితీగా మారిందన్నారు. రెండు కుటుంబాల మధ్య స్పర్థలు ఏర్పడినప్పుడు కట్నం విషయంలో చర్చకు వస్తుందన్నారు. వివాహ సమయంలో కట్నం ఇవ్వడం, తీసుకోవడం జరగకుండా ఉంటేనే మంచిదన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. చట్టం నిర్ణయించిన వయసు లేకుండా పెళ్లి చేస్తే తల్లిదండ్రులతోపాటు పెళ్లి పెద్దలు, పెళ్లికి హాజరైన వారు కూడా శిక్షార్హులేనని తెలిపారు. అమ్మాయిలకు, అబ్బాయిలతోపాటు ఆస్తిలో హక్కు ఉంటుందని, ఆస్తిని పంచుకున్నట్టే తల్లిదండ్రుల పోషణ బాధ్యత కూడా అమ్మాయిలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పుడు పిల్లలకు సెల్‌ఫోన్ వ్యసనంగా మారిందన్నారు. కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉంటే ఇరువర్గాల సమ్మతితో లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వరప్రసాద్ మాట్లాడుతూ టీనేజ్ లోనే ప్రేమలు, పెళ్లిళ్లు అంటున్నారని, పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, అర్బన్ సీఐ ఏపీ మస్తాన్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ జ్వాలా నరసింహశర్మ, ప్యానల్ అడ్వకేట్స్ సోమేశుల శివరామ్, కరీముల్లా, కోర్టు సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

గొప్ప మార్కెట్‌ను నిర్మిస్తున్నాం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న వ్యాపారులు

ప్రొద్దుటూరు : మూడు ఎకరాల విస్తీర్ణంలో రూ.52 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్ గొప్ప మార్కెట్ అవుతుందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో శనివారం ప్రొద్దుటూరు మార్కెట్ మర్చంట్స్ అసోసియేషన్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొద్దుటూరులో కొత్త కూరగాయల మార్కెట్‌ను నిర్మించాలని తాను ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడే ప్రయత్నించానని తెలిపారు. ఆమేరకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే సమస్యను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి రూ.52 కోట్లు మంజూరు చేయించానన్నారు. పాత మార్కెట్‌ను తొలగించేందుకు వ్యాపారులందరూ సహకరించారని, 3 నెలల 10 రోజుల్లో తాత్కాలిక మార్కెట్‌ను నిర్మించామన్నారు. టీడీపీ నేతలు వ్యాపారుల్లో అపనమ్మకాన్ని పెంచే ప్రయత్నం చేసినా తన మాటను విశ్వసించి తాత్కాలిక కూరగాయల మార్కెట్‌కు వచ్చారన్నారు. వేలంపాట నిర్వహించకుండా ప్రస్తుతం ఉన్న వ్యాపారులకే కొత్త మార్కెట్‌లో అవకాశం ఇస్తామని తెలిపారు. ఇందు కోసం ఈనెలాఖరులో జరిగే మున్సిపల్ కౌన్సిల్‌లో పలు తీర్మానాలు చేస్తామన్నారు. అనుకున్న ప్రకారం ఎన్నికల నాటికి మార్కెట్ నిర్మాణం పూర్తి కాకపోతే, ఎన్నికల తర్వాత తాను వ్యాపారులకు అండగా ఉంటానని అన్నారు. మళ్లీ మన ప్రభుత్వమే వస్తుందని, తానే ఎమ్మెల్యేగా దగ్గర ఉండి మిమ్మల్ని కొత్త మార్కెట్‌లో కూర్చోబెడతానన్నారు. ఇప్పటికే మార్కెట్ నిర్మాణానికి సంబంధించి రూ.14కోట్ల పనులు పూర్తయ్యాయని, మరో రూ.15కోట్లను అడ్వాన్స్‌గా మున్సిపల్ కమిషనర్ అకౌంట్‌లో జమ చేయడం జరిగిందన్నారు. ఎక్కడా ఇలా అడ్వాన్స్ ఇచ్చే పరిస్థితి ఉండదని, తాను పట్టుబట్టి ప్రభుత్వంతో నిధులు మంజూరు చేయించానన్నారు. డిసెంబర్ 21న సీఎం జగన్ జన్మదినం సందర్భంగా వ్యాపారులందరికి గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు. వ్యాపారులతోపాటు రాజకీయ ప్రతినిధులతో కలసి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. పూలు, పండ్లు, కూరగాయల వ్యాపారులందరికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను వ్యాపారులు సన్మానించారు. సమావేశంలో మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులు యఖిన్ వల్లి, దాదాపీర్, జాఫర్, ఖాసీం, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి పాల్గొన్నారు.

అగ్రిల్యాబ్ పరీక్షల నిర్వహణలో మొదటి స్థానంలో నిలవాలి



ల్యాబ్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజు

బద్వేలు (అట్లూరు) : డాక్టర్ వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ పరీక్షల నిర్వహణలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు పేర్కొన్నారు. శనివారం ఆయన డాక్టర్ వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన ల్యాబ్‌లోని రికార్డులను, ల్యాబ్ పరికరాలను, విత్తనాల నాణ్యత పరీక్ష, లక్ష్యాలు సాధించిన ప్రగతిపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019 డిశెంబర్ నుంచి ఇప్పటి వరకూ 1425 విత్తన నమూనాలు, 245 ఎరువుల నమూనాలు పరీక్షించి ఫలితాలు ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో రాష్ట్రస్థాయిలో 10వ స్థానంలో ఉందని, మొదటి స్థానం కోసం కృషి చేస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణను పెంచుతున్నట్లు ల్యాబ్ వ్యవసాయ అధికారి బి.మాధురి తెలిపారు. అనంతరం విస్తరణ అధికారి, విత్తన విశ్లేషకులు గుడిమె అరుణ మాట్లాడుతూ రైతులు ఈ నాణ్యతా పరిశోధనా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా సామగ్రితో హెచ్‌ఎం గంగాభవాని తదితరులు

మైదుకూరు : చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మైదుకూరు జెడ్పీ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు గంగాభవాని తెలిపారు. శనివారం అమ్మ సేవా సమితి, సుశీలమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాఠశాలకు క్రీడా సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం గంగాభవాని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే శారీరంగా మానసికంగా, దృఢంగా ఆరోగ్యంగా ఉండగలరన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఖాజా హుస్సేన్, చలమయ్య, అమ్మ సేవా సమితి అధ్యక్షుడు వాగ్దాడం శివశంకర్, సుశీలమ్మ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు ఇమ్మడిశెట్టి సతీష్ బాబు, ఉపాధ్యాయులు దరిశా శ్రీనివాసులు, చంద్రకళ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు వంట సామగ్రి పంపిణీ

చాపాడు : జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు శనివారం వంట పాత్రలు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ రవిశంకర్ మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద కార్యక్రమం ద్వారా మండలంలోని 62 పాఠశాలలకు ప్రభుత్వం వంట పాత్రలు సరఫరా చేసిందన్నారు. వంట పాత్రలు, హస్తాలు, దబరాలు, స్టీల్ బేసిన్, స్టైన్ లెస్ స్టీల్ డీప్ టేబుల్ వంటి ఒక్కో పాఠశాలకు కిట్‌గా అందజేశామన్నారు. వంట పాత్రల సామగ్రిని తహసీల్దారు యామిని సహకారంలో ఆయా పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు. వీటిని వంట ఏజేన్సీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వంశీకృష్ణ, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా సెమి క్రిస్మస్ వేడుకలు



మాట్లాడుతున్న పాస్టేట్ చైర్మన్ రెవ. నందంబజక్

బద్వేలు అర్బన్ : స్థానిక సీఎస్ఐ చర్చిలో శనివారం నిర్వహించిన సెమి క్రిస్మస్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఇందులో భాగంగా చర్చిని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సందేశాత్మక నాటకాలతో, ఆరాధనతో క్రీస్తును స్తుతించారు. ఈ సందర్భంగా పాస్టేట్ చైర్మన్ రెవ. నందంబజక్ మాట్లాడుతూ క్రీస్తు రూపం మన హృదయాలలో జ్యోతిలాగా ప్రజ్వరిల్లాలని, మనం కూడా ప్రేమను పంచి వెలుగును పంచాలని, అప్పుడే మన జీవితానికి సార్థకత ఉంటుందన్నారు. సంఘస్తులందరూ శాంతితో యేసుక్రీస్తును ఆదర్శంగా తీసుకొని ప్రేమ కలిగి జీవించాలన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే సండేస్కూల్ చిన్నారులచే ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి ప్రెస్బిటర్ ఆనందకుమార్, రెవ. రజీత్, చర్చి సెక్రటరీ జి.కె.ఎ.ఎడ్వర్డ్, ట్రెజరర్ ఎం .సునీల్‌కుమార్, ప్రేమ్‌స్వరాజ్, యూత్ కౌన్సిల్ మెంబర్ ఎస్.జ్యోతి, పాస్టేట్ కమిటీ సభ్యులు దేవానందం, జి.ఆర్.జానకమ్మ, సుజాత, జోత్స్న, యూత్ కమిటీ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కాలనీలోని మహిళలు, విశ్వాసులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు తోచినంత సహాయం చేయాలని చెప్పారు.

డిసెంబర్ 1 నుంచి పాత పద్ధతిలోనే..

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్ ఇన్, అవుట్ గేట్లను డిసెంబర్ 1 నుంచి పాత పద్ధతిలోనే నిర్వహించేందుకు డిపో మేనేజర్ అంగీకరించినట్లు సీపీఐ నాయకులు శనివారం తెలిపారు. గతంలో ఉన్న ఇన్, అవుట్ గేట్లను మార్చడంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారని సీపీఐ నాయకులు శ్రీరాములు, శివరాం, భాస్కర్ తదితరులు డిపో మేనేజర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఉన్నతాధికారులతో చర్చించి ఇన్, అవుట్ గేట్లను పాత పద్ధతిలోనే నిర్వహిస్తామని డీఎం శ్రీనివాసరావు హామీ ఇచ్చినట్టు సీపీఐ నాయకులు తెలిపారు. అయితే ఇన్, అవుట్ గేట్లను పాత పద్ధతిలో యథావిధిగా నిర్వహిస్తున్న విషయాన్ని మైదుకూరు బస్టాండ్ మీదుగా బస్సులను నడిపే అన్ని డిపోల వారికి తెలియజేసి డిసెంబర్ 1 నుంచి అమలు చేస్తామని డీఎం చెప్పారని వారు తెలిపారు.

నేడు జ్వాలా తోరణం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకాలు, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు. సాయంత్రం 6 నుంచి 7.30లోపల జ్వాలా తోరణం ఉంటుందన్నారు.

■ రామేశ్వరంలోని శ్రీముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా రాత్రి 7 గంటలకు జ్వాలాతోరణం ఉంటుందని భక్తులు పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు కోరారు. అలాగే 27న కార్తీక రెండవ సోమవారం సందర్భంగా సైకతలింగానికి ప్రత్యేక పూజలు, డిసెంబరు 4న ఉదయం 10 గంటలకు అన్నాభిషేకం, 10న ఉదయం 8 గంటలకు సహస్ర బిల్వార్చన, 11న తిరుణాల జరుగనుంది.

పోస్టర్ల విడుదల

పోరుమామిళ్ల : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 69 వ జాతీయ మహాసభల పోస్టర్లు శనివారం పోరుమామిళ్లలో విడుదల చేశారు. వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగారెడ్డి పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా కన్వీనర్ అభిలాష్ మాట్లాడుతూ జాతీయ మహాసభలు ఢిల్లీలో డిసెంబర్ 7 నుండి 10 వరకు జరుగుతాయన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుండి విద్యార్థులను ఒక దగ్గరకు చేర్చే థీమ్‌తో కార్యక్రమం సాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రమణ, నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కలసపాడు (కాశినాయన) : బాల్యవివాహాలను అరికట్టాలని మండల సమైక్య నజిమ అన్నారు. శనివారం జెండర్ ఆధారితా హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమంలో భాగంగా మండల సమైక్య ఆధ్వర్యంలో మండల కేంద్రమైన నరసాపురంలో మహిళా సభ్యులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించి బాల్యవివాహాలు, మహిళలపై హింస గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాలల హక్కులు, పిల్లల రక్షణ, చిన్నవయస్సులో వివాహం , యుక్తవయస్సులో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు అనంతయ్య, సునీల్, ప్రతాప్, సిద్దయ్య, విజయకుమారి, యానిమేటర్లు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో రేవతి ప్రతిభ

పోరుమామిళ్ల : ప్రొద్దుటూరులో గత రెండు రోజులుగా (శుక్ర, శనివారాల్లో) నిర్వహించిన ఇంటర్ కాలేజియేట్ స్పోర్ట్స్ మీట్‌లో పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని రేవతి సత్తా చాటింది. ట్రిపుల్ జంప్‌లో ప్రథమ బహుమతి, 400 మీటర్ల పరుగులో ద్వితీయ బహుమతి సాధించింది. రేవతి ప్రతిభను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్, వైస్‌ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు, పీడీ నరసింహారెడ్డి అభినందించారు.

ధర్నా జయప్రదం చేయాలి

పోరుమామిళ్ల : ఈ నెల 27, 28 తేదీల్లో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలో చేపట్టనున్న మహాధర్నా జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ పిలుపిచ్చారు. శనివారం ఇక్కడ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులు సాధించుకున్న 44 చట్టాలు రద్దుచేసి 4 లేబర్‌కోడ్‌లు తీసుకవచ్చారన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి తప్పుడు కేసులు పెడుతున్నదన్నారు. కార్మిక వర్గంపై దాడి చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా జరుగుతున్న ధర్నా జయప్రదం చేయాలని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో రవి, కేశవ, వీరయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయోధ్య అక్షింతల శోభాయాత్ర



శోభాయాత్రలో శివానంద సరస్వతి, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, ప్రముఖులు

పోరుమామిళ్ల : అయోధ్య శ్రీ రామచంద్రమూర్తి కల్యాణ అక్షింతలు పోరుమామిళ్లకు శనివారం చేరుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని గిరినగర్ శ్రీరామ దేవస్థానం నుంచి పట్టణశివారులోని శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానం వరకు భారీ శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో శ్రీ శివరామానంద సరస్వతి (మాజీ ఎమ్మెల్యే డాక్టర్ శివరామకృష్ణారావు), రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, శ్రీ వరసిద్ధి వినాయక, కోదండరామస్వామి దేవస్థాన అధ్యక్షులు పాలకొలను రామసుబ్బారెడ్డి, గిరినగర్ శ్రీ రామస్వామి దేవస్థానం అధ్యక్షులు విజయరాములు, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థాన అధ్యక్షులు తులసి సురేష్ బాబు, శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ అధ్యక్షులు శెట్టెం చెన్నయ్య, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కార్యదర్శి బాలాచారి పాల్గొన్నారు. అలాగే కమిటీ సభ్యులు దియ్యాల శ్రీనివాసులు, చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి (వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి), యువజన కన్వీనర్ గిరిప్రణీత్‌రెడ్డి, జనహిత కడప అంచల్ అధ్యక్షులు తుపాకుల శ్రీనివాసులు, జిల్లా ధర్మజాగరణ ప్రముఖ్ బాలరంగయ్య, మానవహక్కుల వేదిక అధ్యక్షులు గంగన్న (విశ్రాంత ఏఎస్ఐ), వివేకానంద సేవాసమితి అధ్యక్షులు మధుసూధనరావు, హైందవ ధార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీరాముని చిత్రపటంతో ప్రముఖులు అక్షింతల కలశాలు తలపై పెట్టుకొని శోభాయాత్రలో నడవగా ముందు భాగాన పెద్దసంఖ్యలో వచ్చిన మహిళలు వేసిన కోలాటం ఆకర్షణగా నిలిచింది. నిర్వాహకులు కల్లూరు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో శ్రీరామ మందిర ప్రతిష్టను పురష్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకమైనది



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రంగస్వామి

మైదుకూరు : జీవితంలో విద్యార్థి దశ కీలకమైనదని మైదుకూరు మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ చదువుతోపాటు ఆటపాటలతో అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాగా చదువుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు. మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని కలిగి రాణించాలని, తన జీవితంలో జరిగిన ఆటుపోట్లను విద్యార్థులకు ఉదహరించారు. లక్ష్య సాధనతో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో తమ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి ర్యాంకులు సాధించడంతో కళాశాలకు జిల్లా స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. కళాశాల అభివృద్ధిలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలన్నారు. సీనియర్ అధ్యాపకుడు ఎం.రాధారామ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డినాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అనంతరాజుపురం సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాధ్యమైందని అన్నారు. గతంలో ప్రజలు ఏ చిన్న పని జరగాలనాన మండల కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా ఉన్న పంచాయతీలోనే సమస్యలు పరిష్కారమవుతున్నాయని అన్నారు. సచివాలయ సిబ్బంది కూడా అంకితభావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో విద్యార్థినులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గౌతమి మహిళా ఇంజనీరింగ్ కాలేజిలో జాయ్ ఆఫ్ పెర్‌ఫార్మింగ్ అండ్ హౌ టు స్టాండ్ అవుట్ ఇన్ క్రియేటెడ్ టాలెంటెడ్ హంట్‌పై రెండు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ విద్యార్థినులను ఆకట్టుకుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాకాంతం తెలిపారు. ప్రముఖ ఉర్క్ సంస్థ వ్యవస్థాపకుడు రవిశంకర్ విద్యార్థులు అవకాశాలు ఎలా సద్వినియోగం చేసుకోవాలి, జీవితంలో ఉన్నత స్థానాలకు ఎలా చేరుకోవాలి అన్న అంశం మీద వివరించారు. క్రియేటివ్ థింకింగ్, కెరియర్ గ్రోత్, పెర్‌ఫార్మెన్స్ మైండ్‌సెట్, హౌటు ఛాలెంజెస్, హ్యాండలింగ్ అట్ వర్క్, పర్పస్ ఆఫ్ యువర్ లైఫ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూషా, హెచ్‌ఓడీలు అధ్యాపకులు పాల్గొన్నారు.